క్లుప్తంగా

నేడు పుస్తకావిష్కరణ

జడ్చర్ల టౌన్: గొల్లపల్లి వద్ద ఉన్న లలితాంబికా తపోవనంలో శుక్రవారం వివేకానంద స్వామి శతకం పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రచయిత కుంచకూరి బుచ్చిలింగం తెలిపారు. ఉదయం 10:30గంటలకు తపోవనంలో హైదరాబాద్ రామకృష్ణమఠం పీఠాధిపతి శ్రీశితికంఠానందస్వామి పుస్తకావిష్కరణ చేస్తారని ఆయన పేర్కొన్నారు.

5న రంగోత్సవం పోటీలు

పాలమూరు: విద్యార్థులలో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు రెయిన్‌బో పాఠశాల ఆధ్వర్యంలో రెయిన్‌బో రంగోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మమత ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని రెయిన్‌బో పాఠశాలలో ఈనెల 5న రెయిన్ బో రంగోత్సవం–2023పై ప్రత్యేక పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో పాల్గొనడానికి పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థుల పేర్లను ఉచితంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. జూనియర్స్, సీనియర్స్ విభాగంలో పోటీలు ఉంటాయని, గెలుపొందిన వారికి విభాగాల వారీగా ప్రథమ బహుమతికి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.3వేలు, తృతీయ బహుమతి రూ.2వేలు నగదు అందజేయనున్నారు. విద్యార్థులు శుక్రవారం మధ్యాహ్నం వరకు పేర్లను నమోదుచేసుకోవాలని సూచించారు. పోటీలకు వచ్చే వారు తప్పక స్కూల్ ఐడీ కార్డులతో రావాలని సూచించారు. జూనియర్స్ విభాగంలో అవర్ విలేజ్–అవర్ ప్రైడ్, సీనియర్స్ విభాగంలో మై ఓట్ ఈజ్ మై ఫ్యూచర్–ఫవర్ ఆఫ్ వన్ ఓట్ అంశాలపై పోటీలు ఉంటాయని తెలిపారు.

4న రాజయోగ కేంద్రం ప్రారంభం

స్టేషన్ మహబూబ్‌నగర్: గద్వాల జిల్లా కేంద్రంలో కొత్తగా నిర్మించిన ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం రాజయోగ భవనాన్ని 4న ప్రారంభించనున్నట్లు ఉమ్మడి జిల్లా సంచాలకురాలు బీకే మహాదేవి గురువారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో లండన్ నుంచి బ్రహ్మకుమారీస్ సంస్థ అడిషనల్ చీఫ్ బీకే జయంతి, మౌంట్‌అబు నుంచి సోషల్ వింగ్ వైస్ చైర్‌పర్సన్ బీకే ప్రేమ్ పాల్గొంటారని తెలిపారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి నివాళి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు పిల్లి సురేష్ మృతదేహానికి గురువారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ఓదార్చారు.

డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు

జడ్చర్ల టౌన్: పరిశోధన రంగంలో విద్యార్థులను ప్రోత్సహించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవీందర్‌రావు తెలిపారు. గురువారం కళాశాల సమావేశ మందిరంలో జిజ్ఞాస విద్యార్థుల అవగాహన సదస్సులో పాల్గొని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. ఏటా నిర్వహించే రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో పరిశోధనలు తీసుకెళ్లే విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అధ్యాయనం చేసే ప్రాజెక్టులను పరిశీలించి వాటిని రాష్ట్రస్థాయిలో ఎంపికయ్యేటట్లు సూపర్‌వైజర్లుగా ఉన్న అధ్యాపకులు చూడాలన్నారు. సదస్సులో సమన్వయకర్త నర్సింహరావు కల్యాణి, అధ్యాపకులు సదాశివయ్య, మంజుల, విక్రం, రామకృష్ణ, విఠల్, సింధు పాల్గొన్నారు.

కార్మికులకు దుప్పట్ల పంపిణీ

బాలానగర్: మండల కేంద్రంలో పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. చలికాలం సమీపిస్తున్నందున దుప్పట్ల పంపిణీ చేసినట్లు వారు పేర్కొన్నారు. యాదయ్య, శ్రీనివాస్ చారి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో కంప్యూటర్ శిక్షణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ సురేందర్ తెలిపారు. పీఎంకేజీవై స్కీం కింద నిరుద్యోగ యువతకు ఉచితంగా శిక్షణను అందిస్తున్నామని, ఆసక్తి గల వారు ఈనెల 10వ తేదీలోపు ఆధార్‌కార్డు, ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని, ఈనెల 15 నుంచి శిక్షణను ప్రారంభిస్తామని తెలిపారు. శిక్షణ ప్రతి రోజు సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు ఉంటుందని, శిక్షణ తర్వాత ధ్రువపత్రాం అందిస్తామని, దాని ద్వారా ఉద్యోగం పొందడం, సొంతంగా ఉపాధి పొందడం వంటి అవకాశాలు ఉంటాయని తెలిపారు. వీటితో పాటు పీఎం శ్రీ స్కీం కింద మొదటి విడత రూ.10 లక్షలు పాఠశాలకు వచ్చాయని, వీటి ద్వారా పాఠశాలలో పూర్తి స్థాయిలో వసతులు కల్పించి, మంచి విద్య అందించగలమని తెలిపారు.

చెక్‌డ్యాం పరిశీలన

చిన్నచింతకుంట: చిన్నచింతకుంట ఊకచెట్టు వాగుపై నిర్మించిన చెక్‌డ్యాంను గురువారం సాయంత్రం ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. చెక్‌డ్యాంను తొలగించే విషయంపై శనివారం గ్రామంలో ప్రజాభిప్రాయం తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

భక్తులకు మరింత సౌకర్యార్థం

కురుమూర్తికి వెళ్లేందుకు పూర్తయిన కాజ్‌వే, బీటీ రోడ్డు



బ్రిడ్జి పూర్తికాక ముందు ఊకచెట్టువాగులో నుంచి వస్తున్న భక్తులు (ఫైల్)



ఊకచెట్టువాగుపై పూర్తయిన కాజ్‌వే

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఈ సారి ఊకచెట్టువాగులో ఇబ్బందులు తప్పనున్నాయి. 2020లో ఊకచెట్టువాగుపై కాజువే నిర్మాణం, కురుమూర్తి స్వామి ఆలయం వరకు బీటీ, ఘాట్‌రోడ్డు నిర్మాణానికి రూ.41 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. అధికారులు పనులను ప్రారంభించి ప్రస్తుతం కాజ్‌వే, స్వామివారి ఆలయ జాతర మైదానం వరకు బీటీ రోడ్డు పూర్తి చేశారు. దీంతో ఈ సంవత్సరం రాయచూరు, నారాయణపేట జిల్లాలతో పాటు, మక్తల్, నర్వ, అమరచింత, ధన్వాడ, మరికల్ మండలాలనుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పనున్నాయి.

ఏళ్లుగా ఇబ్బందులు..

ఊకచెట్టువాగుపై కాజ్‌వే లేకపోవడంతో ప్రతి ఏడాది కురుమూర్తి ఉత్సవాలకు వచ్చే భక్తులు తీవ్ర ఇబందులకు గురయ్యేవారు. అప్పట్లో అల్లిపురం సమీపంలో మాత్రమే ఊకచెట్టువాగుపై వంతెన ఉండేది. దీంతో వర్షాకాలం వస్తే వాగులో కోయిల్ సాగర్ ప్రాజెక్టు నుంచి దిగువకు వదిలే నీటి వరద ఉధృతికి వాగు నిండుగా పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, బైకులు దాటే సమయంలో ఎన్నో ప్రమాదాలు సంభవించేవి. ఆలయానికి రావాలంటే 25 కిలో మీటర్లు చుట్టూ తిరిగి రావాల్సి వచ్చేది. అంతేకాక రాయచూరు, కొత్తకోట జాతీయ రహదారికి దగ్గర దారి కావడంతో వాహనదారులు ఎక్కువగా ఈ మార్గంలోనే ప్రయాణిస్తుంటారు. ఊకచెట్టువాగుపై కాజ్‌వే నిర్మాణం, కురుమూర్తి స్వామి ఆలయం వరకు బీటీరోడ్డు వేయడంతో కురుమూర్తి స్వామి భక్తులతోపాటు వాగు అవతలి, ఇవతలి గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పాయి.

ఇబ్బందులకు గురయ్యాం



కురుమూర్తిస్వామి ఉత్సవాలకు అమరచింత మండలం నుంచి వచ్చే భక్తులు చిన్నచింతకుంట ఊకచెట్టువాగులో తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. వాగులో వరదనీరు ఉన్నపుడు 25 కిలో మీటర్ల దూరం అదనంగా అల్లిపురం బ్రిడ్జి పైనుంచి వెళ్లాల్సి వచ్చేది. గంట, రెండు గంటల సమయం అదనంగా పట్టేది. ఇప్పుడు కాజ్వే నిర్మాణం చేపట్టడంతో స్వామి వారి ఉత్సవాలకు రావడానికి ఇబ్బందులు ఉండవు. 30 నిమిషాల్లో ఆలయానికి చేరుకుంటాం.

– నర్సింహులు, అమరచింత

ఇబ్బందులు తప్పాయి



ఏటా కురుమూర్తి జాతరకు నర్వ, మక్తల్, మరికల్, ధన్వాడతో పాటు నారాయణపేట జిల్లా నుంచి భక్తులు ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లుపైన వచ్చేవారు. వాగులో వాహనాలు దిగబడి ఇబ్బందులకు గురయ్యేవారు. కాజ్‌వే నిర్మాణం పూర్తి కావడంతో భక్తులకు ఈ సంవత్సరం అలాంటి ఇబ్బందులు ఉండవు.

– ప్రతాప్‌రెడ్డి, కురుమూర్తి స్వామి ఆలయ కమిటీ చైర్మన్

ఎన్నికల హామీలన్నీ అమలు చేశాం



కొత్తగంజిలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ రూరల్/మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/జెడ్పీసెంటర్/గండేడ్: బీఆర్‌ఎస్ పాలనలోనే ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని ఓబ్లాయిపల్లి, ఓబ్లాయిపల్లి తండా, కోటకదిరలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు సమీకరణలో 11 సార్లు అధికారంలో ఉన్నారని, వారి పాలనలో రైతులకు కనీసం ఒక్క రూపాయి అయినా సాయం చేశారా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతుబంధు, రైతుబీమాతో ధీమా కల్పించామని అన్నారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి జిల్లాలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందిస్తామని, వలసలను శాశ్వతంగా నివారిస్తామని అన్నారు.

ప్రముఖ పుణ్యక్షేత్రంగా మన్యంకొండ

రాష్ట్రంలోనే మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని ప్రముఖ పుణ్యక్షేత్రంగా మారుస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మన్యంకొండ వద్ద నిర్మాణం చేపట్టామని అన్నారు. అలివేలు మంగతాయారు దేవాలయం వద్ద కల్యాణ మండపం, పార్కు, డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్, వసతి గదులు ఇలా అనేక సదుపాయాలను తీర్చిదిద్దామని అన్నారు.

ఎన్నికలప్పుడే వచ్చే నాయకులను నమ్మొద్దు

కేవలం ఎన్నికల కోసమే ప్రజల మధ్య కు వచ్చే నాయకులను నమ్మొద్దని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం రాత్రి కొత్తగంజి, కోయిల్ కొండ ఎక్స్ రోడ్డు, టీడీగుట్ట, ఖలీల్‌చౌక్ సమీపంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రోడ్ షోలో ఆయన మాట్లాడుతూ వాట్సప్ ద్వారా తప్పుడు ప్రచారం చేస్తూ ఎన్నికల్లో గెలవాలని యత్నిస్తున్న నాయకులతో అప్రమత్తంగా ఉండాలన్నారు.

ప్రచారంలో బీఆర్‌ఎస్ నాయకులు

అభివృద్ధి చూసి ఓటేయ్యండని జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యానాయక్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు మన్సూర్‌పల్లి తండాలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ప్రతిపక్షాలు ఖాళీ

రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ప్రతిపక్షాలు ఖాళీ అవుతున్నాయని మంత్రి తెలిపారు. మంత్రి ఫాం హౌస్‌లో టౌన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి విజయ్‌ప్రసాద్ మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

విద్యార్థులకు ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు టాస్క్ ఆధ్వర్యంలో ఉచిత ట్యాలీ వర్క్ శిక్షణ గురువారం ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలంటే ట్యాలీ లాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణకు 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో టాస్క్ కోఆర్డినేటర్ కలమ్మ, మెంటర్ స్వరూప పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోండి

జడ్చర్ల టౌన్: పట్టణంలోని విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయంలో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఏడీఈ శ్రీనివాసులు తెలియజేశారు. సదస్సుకు సబ్‌డివిజన్ పరిధిలోని పట్టణ, గ్రామీణ, మిడ్జిల్, భూత్పూర్, మూసాపేట, అడ్డాకుల మండలాల వినియోగదారులు హాజరు కావాలని కోరారు. ఏవైనా సమస్యలుంటే ఫిర్యాదులు చేసి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. చిన్న చిన్నవి, అప్పటికప్పుడు పరిష్కరించే సమస్యలుంటే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ఉదయం 10:30గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నవాబుపేట: విద్యుత్ వినియోగదారుల దినోత్సవం రాజాపూర్ విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఏడీ ఛార్యనాయక్ తెలిపారు. నవాబుపేట, రాజాపూర్, బాలానగర్ మండలాల వినియోగదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వండి



మూసాపేటలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల/చిన్నచింతకుంట: రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి మూసాపేటలో పార్టీ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించి ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ పాలనపై ప్రజలు విసుగు చెందారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిన బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే దోచుకోవడం, దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. . కార్యక్రమంలో శెట్టిశేఖర్, జగదీశ్వర్, పాశం తిరుపతయ్య, గోవర్ధన్, రాజశేఖర్‌రెడ్డి, చెన్నమ్మ, నిరంజన్, శ్రీనివాసులు, వెంకటేష్, సురేష్, బాలరాజు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

చిన్నచింతకుంట మండలం ధమగ్నాపురం గ్రామంలో డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో నర్సింహారెడ్డి, రఘురెడ్డి, సర్పంచ్ హన్మంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వీరితో పాటు వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు పార్టీలో చేరారు.

చెక్‌డ్యాం తొలగించాలని కలెక్టర్‌కు వినతి

చిన్నచింతకుంట: మండలంలోని ఊకచెట్టువాగుపై నిర్మించిన చెక్‌డ్యాంను తొలగించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నంబిరాజు, అసెంబ్లీ కన్వీనర్ కుర్వరమేష్ గురువారం కురుమూర్తి స్వామి ఆలయం వద్దకు వచ్చిన కలెక్టర్ రవినాయక్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ చెక్‌డ్యాంతో గ్రామ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెక్‌డ్యాం సమీపంలో ఉన్న శ్మశానవాటికలోకి చెక్‌డ్యాం నీరు చేరి దుర్గంధం వెదజల్లుతుందన్నారు. గ్రామానికి చెక్‌డ్యాం దగ్గరలో ఉండడంతో కుక్కలు, పందులు అందులో పడి మృతి చెందుతున్నాయన్నారు. ఈ చెక్‌డ్యాం నుంచే గ్రామానికి తాగు నీరు అందుతుండడంతో ఆనీటిని తాగి ప్రజలకు పలురోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. చెక్‌డ్యాంను పరిశీలించి తొలగించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు, గ్రామస్తులు క లెక్టర్‌ను కోరారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సడక్ యోజనతో ప్రతి గ్రామానికి రోడ్డు

- డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అందరికీ సంక్షేమ ఫలాలు
- కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ మంత్రి భగవత్ కూబ



టంకరలో ప్రచారం నిర్వహిస్తున్న కేంద్ర మంత్రి భగవత్ కూబ, అభ్యర్థి మిథున్‌రెడ్డి

పాలమూరు/హన్వాడ: సడక్ యోజన పథకంతో ప్రతి గ్రామానికి కేంద్ర ప్రభుత్వం బీటీ రోడ్డు వేయించిందని కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ మంత్రి భగవత్ కూబ అన్నారు. గురువారం ఆయన హన్వాడ మండలంలోని కొత్తపేట, టంకరలో మహబూబ్‌నగర్ బీజేపీ అభ్యర్థి మిథున్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ సీఎం కేసీఆర్‌పై పలు విమర్శలు చేశారు. రాష్ట్రానికి మొదట సీఎం దళితుడిని చేస్తానని చెప్పి, గద్దెనెక్కిన సీఎం కేసీఆర్, గడిచిన పదేళ్ల దళితులను దగా చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీలకు ఎస్సీబంధు, బీసీలకు బీసీబంధు పేరిట ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. అదే విధంగా యాదవులకు సబ్సిడీ గొర్రెల పంపిణీ పేరిట డీడీలు కట్టించుకుని వారికి ఇప్పటి వరకు ఇవ్వలేదని, ప్రజాధనం లూటీ చేస్తూ పబ్బం గడుపుతున్నట్లు విమర్శలు చేశారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తేనే కేంద్రం ఇస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరుతాయని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి, కొండాబుచ్చిరెడ్డి, వెంకటయ్య, తిర్పతయ్య, హన్మంతు, కృష్ణయ్య పాల్గొన్నారు.

■ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డ, పద్మావతి కాలనీ, శ్రీనివాస కాలనీలో గురువారం సాయంత్రం బీజేపీ అభ్యర్థి మిథున్‌రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి భగవంత్ కూబ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ కేంద్ర సంక్షేమ పథకాలను వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వ తీరును విమర్శించారు.

కొత్తపేటలో ప్రచారం

మండలంలోని కొత్తపేటలో గురువారం బీజేపీ అభ్యర్థి మిథున్‌కుమార్‌రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన 7వ వార్డు సభ్యుడు, బీఆర్‌ఎస్ నాయకుడు నారమోని శ్రీను బీజేపీలో చేరారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి



జడ్చర్లలో ఇంటింటి ప్రచారంలో ఓట్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల/నవాబుపేట/రాజాపూర్/బాలానగర్: నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాం.. ఈ సారి ఎన్నికలలో తాము చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటు వేయాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఓటర్లను కోరారు. గురువారం ఆయన స్థానిక నిమ్మబాయిగడ్డలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. సీఎం కేసీఆర్ తలపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. కేవలం రాష్ట్రంలోనే రైతులకు రైతుబంధు, బీమా పథకాలను అమలు చేస్తున్నామని గుర్తుచేశారు. ఈ విడత ఎన్నికలలో బీఆర్‌ఎస్‌కు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో తమను గెలిపిస్తే కేసీఆర్ బీమా, పింఛన్ల పెంపుతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమే..

మరిచిపోయి కాంగ్రెస్‌కు ఓటేస్తే బతుకులు ఆగమవుతాయని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. నవాబుపేట మండలంలోని కాకర్లపహాడ్, మల్లరెడ్డిపల్లి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఆయన కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

పని చేసే ప్రభుత్వానికి పట్టం కట్టాలి

సాధించుకున్న రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టాలని డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం రాజాపూర్ మండలంలోని సింగమ్మతండా, పెద్దగడ్డతండా, అంజమ్మతండాలలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో వారికే ఇంకా క్లారిటీ లేదన్నారు.

బాలానగర్ మండలంలోని చింతకుంటతండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రవీందర్ నాయక్, వార్డు సభ్యులు, పలువురు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

ఆర్‌యూబీ నిర్మాణానికి కృషి చేస్తా..



దేవరకద్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర/భూత్పూర్: నియోజకవర్గ కేంద్రంలోని రైల్వే గేటు స్థానంలో ఆర్‌యూబీ నిర్మాణం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలో వ్యాపార కేంద్రాలను బంద్ చేసి పాత బస్టాండ్‌లో ధర్నా చేస్తున్న వ్యాపారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికల తర్వాత పట్టణ ప్రజలకు ఆర్వోబీ వల్ల ఏర్పడిన ఇబ్బందులను తొలగించడానికి ప్రయత్నిస్తానన్నారు. ప్రస్తుతం ఆర్వోబీ వల్ల బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న బస్టాండ్ స్థానంలో మరో బస్టాండ్‌ను నిర్మించడానికి కృషి చేస్తానని తెలిపారు.

సంక్షేమ ఫలాలు అందించిన ఘనత బీఆర్‌ఎస్‌దే

రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీకే దక్కుతుందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం భూత్పూర్ మండలంలోని తాటిపర్తి, కొత్తూర్, పెద్దతండా, కర్వెనలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా పట్టణంలోని రామలింగేశ్వర దేవాలయంలో శివుడికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గ్రామాల్లో పర్యటించారు. కర్వెన పంచాయతీలో రూ.26 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. 30న పోలింగ్‌లో మూడో సారి గెలిపించాలని, మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

బూత్‌స్థాయిలో చురుగ్గా పనిచేయాలి

తమిళనాడు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్‌కుమార్ మంగళం



మాట్లాడుతున్న మోహన్‌కుమార్ మంగళం

స్టేషన్ మహబూబ్‌నగర్/గండేడ్/మహమ్మదాబాద్: బూత్‌స్థాయిలో కార్యకర్తలు చురుగ్గా పనిచేయాలని తమిళనాడు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఏఐసీసీ పార్లమెంట్ పరిశీలకుడు రంగరాజన్ మోహన్‌కుమార్ మంగళం అన్నారు. జిల్లా కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో గురువారం అసెంబ్లీ నియోజకవర్గ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన గ్యారంటీ పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలన్నారు. గ్యారంటీ పథకాలతోనే హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక ఇతర రాష్ట్రాల్లో పార్టీ అధికారంలోకి వచ్చినట్లు గుర్తుచేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెలంగాణ, మహబూబ్‌నగర్‌లో పార్టీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని, క్షేత్రస్థాయిలో కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కోరారు. సమావేశంలో వినోద్‌కుమార్, జహీర్ అఖ్తర్ తదితరులు ప్రసంగించారు.

బీఆర్‌ఎస్ తుడిచిపెట్టుకు పోవడం ఖాయం

అమలు కాని హామీలతో ప్రజలను మోసం చేసిన బీఆర్‌ఎస్ తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని గండేడ్, మహమ్మదాబాద్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్‌రెడ్డి, నారాయణ పేర్కొన్నారు. గురువారం గండేడ్, మహమ్మదాబాద్ మండలాల పరిధిలోని వెన్నాచేడ్, కప్లాపూర్, దేశాయిపల్లిలో ప్రచారం నిర్వహించారు. సాగునీరు పేరుతో ఉమ్మడి గండేడ్ మండలాన్ని ఏడారిగా మార్చారని అన్నారు. గొర్రెల పంపిణీ పేరుతో యాదవులకు తీరని అన్యాయం చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరిక



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు

కోయిల్‌కొండ: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పెద్ద సంఖ్యలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని శేరివెంకటాపూర్‌లో ఏర్పాటు చేసిన ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ విద్యాసాగర్‌కు బీఆర్‌ఎస్ కండువా వేసి పార్టీలో ఆహ్వానించారు. ముదిరాజ్‌ల అభివృద్ధి బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, కృష్ణయ్య, శ్రీనివాస్‌రెడ్డి, గోరిసతీష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ వలలో పడొద్దు

నవాబుపేట: ఫోన్‌లో అపరిచిత వ్యక్తులు మాటలు కలిపి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు కాజేస్తారని, అందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పురుషోత్తం తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఫోన్‌లో ఓటీపీ తదితర వివరాలు అడిగితే చెప్పకూడదని సూచించారు. మెయిల్, ఇతర మెసేజ్‌లు పంపించి దాన్ని ఫార్వర్డ్ చేయమనటం, ఫోన్‌కు బహుమతి వచ్చిందని కాల్ చేయటం, బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఖాతా అప్‌డేట్ చేస్తున్నామని చెప్పి ఓటీపీ చెప్పమంటారని అలా చెప్పారంటే ఖాతా మొత్తం ఖాళీ అవుతుందని, ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.